
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 23 సెప్టెంబరు 2024



జిల్లా పంచాయతీ అధికారిగా వెంకటేశ్వరరావు

విజయనగరం టౌన్: జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన శ్రీకాకుళంలో డీపీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీపీవోగా పనిచేస్తున్న ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా శ్రీకాకుళం జడ్పీ సీఈవోగా బదిలీ అయ్యారు. ● జడ్పీ సీఈవోగా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈయన విజయనగరం డ్వామాలో ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే, జడ్పీ డిప్యూటీ సీఈవోగా ఆర్.వెంకటరామన్ నియమితులయ్యారు. ఈయన శ్రీకాకుళం నుంచి ఇక్కడకు వచ్చారు. విజయనగరం జడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్‌కు విశాఖ బదిలీ అయ్యింది.

28న పైడిమాంబ

● అదే రోజు ప్రత్యేక పూజలు

సిరిమాను చెట్టు తరలింపు

విజయనగరం రూరల్/డెంకాడ, సెప్టెంబరు 22: పైడిమాంబ సిరిమానోత్సవానికి సంబంధించిన చెట్టు గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. పెదతాడివాడ పైడిమాంబ ఆలయ రోడ్డులో ఉన్న మజ్జి అప్పారావు కళ్లాల్లో ఈ చెట్టును గుర్తించారు. ఆదివారం ఈ చెట్టుకి సంప్రదాయం ప్రకారం దేవస్థానం తరపున అర్చకులు, అధికారులు వెళ్లి పసుపు, కుంకుమ సమర్పించి, బొట్టుపెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి శాస్త్రోక్తంగా పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ నెల 28న ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, పులివేషాలతో చెట్టును విజయనగరం తరలించనున్నారు. ఉదయం వేగంగా ఈ ప్రక్రియను ప్రారంభించి, రాత్రి తొమ్మిది గంటల్లోగా హుకుంపేటలోని పూజారి గృహానికి చేరవేయాలని పోలీసుశాఖ సూచించింది. ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, చెట్టు కొట్టే ప్రక్రియ జరగనుంది. మధ్యాహ్నం భక్తులకు దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ జరగనుంది.





సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి, పూజారి వెంకటరావు



ముర్రాటలతో వచ్చిన మహిళలు

అనంతరం అక్కడి నుంచి భక్తులు సిరిమాను వెంట తరలిరానున్నారు. పెదతాడివాడ నుంచి విజయనగరం రోడ్డుపైకి వచ్చిన తరువాత నగరంలో ఏ ప్రాంతాల మీదుగా తీసుకురావాలన్న దానిపై పోలీసుశాఖ, దేవదాయశాఖతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సూచనలతో మరో రెండు రోజుల్లో రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేయనున్నారు. ఈ రూట్‌మ్యాప్ ప్రకారం పైడిమాంబ భక్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. మాన్సాస్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం నాగమాధవితో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. పోలీసు బందోబస్తు కూడా నిర్వహించనున్నారు. డెంకాడ, విజయనగరం 1, 2, రూరల్ సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు.

భక్తులకు ఉచిత దర్శనం...

విజయనగరం (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ తొలేళ్లు, సిరిమానోత్సవంలో అమ్మవారిని ఉచితంగా దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 14, 15 తేదీల్లో పైడిమాంబ తొలేళ్లు, సిరిమానోత్సవం జరుగుతుందని, ఈ సందర్భం గా లక్షలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారని చెప్పారు. వీరికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శీఘ్రదర్శనానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో తొలేళ్లు, సిరిమానోత్సవం రోజున అమ్మవారి దర్శనానికి రూ.50, రూ.100, రూ.300 టిక్కెట్లు విక్రయించేవారని, ఈసారి వాటిని రద్దుచేసినట్లు తెలిపారు. ఈ టిక్కెట్ల రద్దుతో ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లినా, భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



ఎప్పుడు ఇస్తారో?

- 'బుడా' నిధుల కోసం మూడు మున్సిపాలిటీల ఎదురుచూపు
- నియోజకవర్గాల వారీగా పంపిణీ చేసేందుకు కసరత్తు
- 22 అనధికారిక లేఅవుట్లు గుర్తింపు
- స్మార్ట్ సిటీలకు సమస్యగా మారిన స్థలసేకరణ

బొబ్బిలి, సెప్టెంబరు 22: బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) నుంచి నిధులు విడుదల కోసం మూడు మున్సిపాలిటీలు ఎదురుచూస్తున్నాయి. 2019కి ముందు బొబ్బిలిలో బుడా ఏర్పాటైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సుమారు రూ.5 కోట్ల వరకు బుడా నిధులు ఉండే అవకాశం ఉంది. ఈ నిధులను నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు. బుడా పరిధిలో బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీలతో పాటు ఈ మూడు నియోజకవర్గాల పరిధిలోని మండలాలు ఉన్నాయి. మున్సిపాలిటీలు, నియోజకవర్గాలకు బుడాలోని నిల్వ నిధుల నుంచి 50 శాతం పంపిణీ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నిధుల కోసం మున్సిపాలిటీలు, ఇతర పంచాయతీలు ఎదురుచూస్తున్నాయి.

● బుడా ఆవిర్భావం తరువాత గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మాణాలకు అనుమతులను బుడాయే మంజూరు చేయాల్సి ఉంది. కానీ పంచాయతీ కార్యదర్శులు గతంలో మాదిరిగా ప్లాన్‌లను మంజూరు చేస్తున్నారు. వాస్తవానికి 300 చదరపు గజాల లోపు నిర్మాణాలకు మాత్రమే వారు ప్లాన్‌లు మంజూరు చేసే అధికారం ఉంది. అంతకుమించిన నిర్మాణాలను బుడాకు పంపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో అధికారిక, అనధికారిక లేఅవుట్లు, ఇతర నిర్మాణాల వివరాలను తెలియజేయాలని కోరుతూ బుడా నుంచి కార్యదర్శులకు లేఖలు పంపించారు. ఇంతవరకు 22 లేఅవుట్లు అనధికారికంగా ఉన్నట్లు గుర్తించారు.

● బుడా ఏర్పడక మునుపు అనేక లేఅవుట్లను నిబంధనలకు విరుద్ధంగా యజమానులు ఏర్పాటు చేశారు. పది శాతం ఖాళీస్థలాలను ఉంచడం, 30 అడుగులకు పైగా రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం వంటి నిబంధనలకు తిలోదకాలిచ్చి వ్యాపారాలు సాగించిన దాఖలాలు ఉన్నాయి. వాటన్నిటినీ రెగ్యులరైజ్ చేయకపోవడంతో కొనుగోలు దారులు అవస్థలు పడుతున్నారు. అలాంటి ఇళ్లకు ప్లాన్‌లు, బ్యాంకు రుణాలు మంజూరు కావడం లేదు. దీనితో స్థలాల కొనుగోలు దారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● బుడా పరిధిలో ఉన్న పట్టణాల్లో స్మార్ట్ సిటీలకు ఎన్టీఆర్ స్మార్ట్ సిటీలుగా పేరు మార్చారు. సాలూరు పట్టణంలో మాత్రమే ఈ స్మార్ట్‌సిటీ ఏర్పాటు విజయవంతమైంది. బొబ్బిలి పట్టణంలో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ స్థల సేకరణ చేయడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారు. దీంతో మధ్య తరగతి, ఉద్యోగ వర్గాల వారి సొంత ఇంటికల నెరవేరేందుకు పరిస్థితులు అనుకూలించడం లేదు. పార్వతీపురం మున్సిపాలిటీలో అడ్డాపుశీల ప్రాంతంలో స్మార్ట్‌సిటీ ఏర్పాటుకు ప్రతిపాదించినప్పటికీ కొండప్రాంతం కావడంతో అది ఇళ్లనిర్మాణాలకు యోగ్యం కాదని ఉన్నతాధికారులు తిరస్కరించారు. దీంతో బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాలిటీలలో స్మార్ట్ సిటీల ఏర్పాటు కోసం స్థల సేకరణ చేయడం చాలా పెద్దసమస్యగా మారిపోయింది. స్మార్ట్ సిటీలో స్థలాల కోసం కొనుగోలుదారుల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉన్న నేపథ్యంలో స్థలసేకరణ ముమ్మరం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు లేఖలు రాశాం..

అధికార, అనధికార లేఅవుట్లపై పూర్తి సమాచారం అందజేయాలని పంచాయతీల కార్యదర్శులకు లేఖలు రాశాం. 300 గజాలలోపు నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చేందుకు కార్యదర్శులకు అధికారం ఉంది. అంతకుమించి ఇచ్చేందుకు వారికి అధికారం లేదు. బుడా నిధుల పంపకానికి సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. బొబ్బిలి,పార్వతీపురం మున్సిపాలిటీల్లో స్మార్ట్ సిటీల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ పెద్దసమస్య అయిపోయింది.

-దేవకుమార్, ఏపీవో, బుడా

- డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఏళ్లుగా పాతుకుపోయిన ఉద్యోగులు
- బదిలీ చేసినా డిప్యుటేషన్‌పై మళ్లీ పాతస్థానానికి వచ్చేస్తున్నవైనం
- వెల్లువెత్తుతున్న విమర్శలు

కదలరు.. వదలరు



(విజయనగరం రింగురోడ్డు)

● డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగిని ఇటీవల పార్వతీపురం-మన్యం జిల్లా సాలూరు ఏరియా ఆసుపత్రికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బదిలీ చేశారు. ఆయన సాలూరు ఆసుపత్రిలో వారం కూడా పనిచేయకుండానే తిరిగి డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై వచ్చి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

● చీపురుపల్లి ఆసుపత్రిలో పనిచేసే వైద్యుడిని డీసీహెచ్ కార్యాలయానికి కొద్ది రోజుల కిందట డిప్యూటేషన్ వేశారు. దీనివల్ల అక్కడ వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది.

● చీపురుపల్లి సామాజిక ఆసుపత్రిలో పనిచేసే ఒక ఉద్యోగిని భోగాపురం సామాజిక ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. గజపతినగరం ఆసుపత్రిలో ఔట్ సోర్సింగు పద్ధతిలో పనిచేసిన నాలుగో తరగతి ఉద్యోగిని డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై తీసుకురావడం పలు అనుమానాలకు తావిస్తోంది. వాస్తవంగా ఈ ఉద్యోగి ఇక్కడ చేయడానికి విధులు లేవు. ఈ విధంగా పరపతి, డబ్బు ఉపయోగించుకుని డిప్యూటేషన్‌పై తిరిగి అదే ప్రాంతంలో దీర్ఘకాలికంగా విధులు నిర్వహిస్తున్నారు.



డీసీహెచ్‌ఎస్ కార్యాలయం

జిల్లా వైద్య విధాన పరిషత్ కార్యాలయం (డీసీహెచ్‌ఎస్)లో కొందరు ఉద్యోగులు ఏళ్లుగా పాతుకుపోయారు. ఇక్కడి నుంచి వేరేచోటకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. ఒకవేళ బదిలీపై వెళ్లిన డిప్యూటేషన్లపై మళ్లీ యథాస్థానానికి వచ్చేస్తున్నారు. ప్రభుత్వం ఏదైనా, పాలకులు ఎవరైనా వీరు మాత్రం అందరికీ విధేయులుగా ఉంటున్నారు. జిల్లాలో ఎక్కడికి బదిలీపై వెళ్లినా తిరిగి అదే స్థానానికి డిప్యూటేషన్లపై వచ్చేస్తున్నారు. డీసీహెచ్‌ఎస్‌లు మారుతున్నా వీరు మాత్రం మారడం లేదు. కొత్తగా వచ్చిన డీసీహెచ్‌ఎస్‌ల సైతం డిప్యూటేషన్ల పర్వంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా డిప్యూటేషన్లు చేయడంపై ఉద్యోగులపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. స్థానికంగా పనిచేసే ఉద్యోగులకు ఆటంకం కలగడంతో పాటు పనిభారంతో సతమతమవుతున్నారు. ప్రజలకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు నిర్వహించి, రిటైర్డ్ అయిన అధికారి ఈ డిప్యూటేషన్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. దీంతో చాలా మంది డిప్యూటేషన్లపైనే ఆధారపడుతున్నారు. పదోన్నతిపై బదిలీపై ఎక్కడకు వెళ్లినా, తిరిగి అదేస్థానంలో విధులు నిర్వహించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.. ఈ డిప్యూటేషన్ల పర్వానికి ఆ కార్యాలయంలోని కొంత మంది ఉద్యోగులు చక్రం తిప్పుతున్నట్టు సమాచారం. ఈ విషయంపై డీసీహెచ్‌ఎస్ డాక్టరు జీవీ రాజ్యలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. 'నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టా. నేను బాధ్యతల చేపట్టక ముందే ఈ డిప్యూటేషన్ల పర్వం జరిగింది. నిబంధనల ప్రకారం నేను చేస్తా. కొత్తగా డిప్యూటేషన్లు ఎవరికీ ఇవ్వలేదని' స్పష్టం చేశారు.

ముగిసిన బదిలీల ప్రక్రియ

● సిఫారసులకే పెద్ద పీట

కలెక్టరేట్: జిల్లాలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఈసారి నిర్వహించిన బదిలీల్లో ఎక్కువగా సిఫారసులకే పెద్దపీట వేసినట్లు తెలిసింది. బదిలీలకు రెండుసార్లు గడువు పెంచినా చివరి రోజునే ప్రక్రియ పూర్తి చేశారు. ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం గత నెల 15న జీవో ఇచ్చింది. అదే నెల 31లోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని జీవోలో పేర్కొంది. దీంతో అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు అంతా సిద్ధం చేశారు. అప్పట్లో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు తీసుకున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమకు కావల్సిన అధికారులను తెచ్చుకోవడానికి లేఖలను కూడా అందించారు. ఈ తరుణంలో బదిలీల ప్రక్రియను ఈ నెల 15కు వాయిదా వేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే, విజయవాడలో వరదలు కారణంగా బదిలీలు ప్రక్రియను ఈనెల 22 వరకూ పొడిస్తూ ప్రభుత్వం మరో జీవో ఇచ్చిన సంగతి తెలిసిందే. గడువు రెండు సార్లు ఇచ్చినా బదిలీలు అంతా చివరి రోజునే జరిగాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్, వెలుగు శాఖలకు చెందిన ఉద్యోగులను ఎక్కువ సంఖ్యలో బదిలీ చేశారు. ఎక్కువ మంది బదిలీలు కోసం దరఖాస్తుకున్నప్పుడు వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్న నిబంధన ఉందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. కానీ, అలా జరగకుండా ప్రజా ప్రతినిధులు లేఖలకు పెద్దపీట వేసి బదిలీలు నిర్వహించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ప్రజా ప్రతినిధుల నుంచి లేఖలు తెచ్చుకున్న ఉద్యోగులకు వారికి అనుకున్న స్థానాల్లో చోటు వచ్చినట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులకు పని చేసిన చోట ఐదు సంవత్సరాలు పూర్తి కాకపోయినా పరిపాలన సౌలభ్యం కోసం వేరేచోటకు బదిలీ చేసినట్లు సమాచారం. బదిలీల్లో ప్రజా ప్రతినిధుల నుంచి లేఖలు తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మొదటిలో ఉన్నతాధికారులు వెల్లడించారని, దీనివల్ల లేఖలు తెచ్చుకులేదని, తరువాత లేఖలు తెచ్చుకున్నారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

గ్రామాలకు మహర్దశ



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

- రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు
- 775 గ్రామ పంచాయతీలకు రూ.30 కోట్లు కేటాయింపు
- మండల, జిల్లా పరిషత్‌లకు రూ.8కోట్ల చొప్పున మంజూరు

విజయనగరం టౌన్, సెప్టెంబరు 22: కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ పట్టింది. గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు విదల్చకుండా, కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను వెనక్కి లాగేసుకుంది. దీనివల్ల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. అన్ని విధాల గ్రామాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు వాటిపై దృష్టి సారించారు. 2023- 2024 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. ఇవి స్థానిక సంస్థల ఖాతాల్లోకి జమ అయ్యాయి. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు.

ఊపందుకున్న పనులు..

జిల్లాలోని 775 గ్రామ పంచాయతీల్లోని ఖాతాలకు రూ.30.77 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు జమ అయ్యాయి. వీటిలో టైడ్ నిధులు రూ.18.44 కోట్లు కాగా, అన్‌టైడ్ నిధులు రూ. 12.29 కోట్లు. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, తాగునీటి సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, సిబ్బందికి వేతనాల చెల్లింపు, శ్మశాన వాటికల అభివృద్ధి తదితర పనులు చేసేందుకు అవకాశం ఏర్పడింది. సర్పంచుల ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అలాగే 27 మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు మంజూరైన టైడ్, అన్‌టైడ్ నిధులు రూ. 16.22 కోట్లను గ్రామాల్లో అభివృద్ధి పనులు, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని అనేక గ్రామాల్లో కొద్దిరోజులుగా పనులు ఊపందుకున్నాయి.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పిస్తాం..



2023- 2024 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ప్రభుత్వం నుంచి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.47.02 కోట్లు విడుదలయ్యాయి. వీటిని బ్యాంకు ఖాతాలకు జమ చేశాం. గ్రామ పంచాయతీల ఖాతాల్లో రూ. 30.77 కోట్లు జమ చేశాం. ఇప్పటికే ఈ నిధులతో ఈ నెల 6 నుంచి 20 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్యం డ్రైవ్ నిర్వహించాం. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాం.

-శ్రీధర్‌రాజా, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో, విజయనగరం

బిజినెస్
శ్రీకాకుళం ● సోమవారం 23 సెప్టెంబరు 2024

ఈ వారం మరో 11 ఐపీఓలు

» 14 కంపెనీల షేర్ల లిస్టింగ్

ముంబై: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ సందడిగా ఉండనుంది. దాదాపు రూ.900 కోట్ల సమీకరణ కోసం 11 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో మన్‌బా ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ అనే రెండు కంపెనీల ఐపీఓలు మాత్రమే మెయిన్‌బోర్డు కంపెనీల ఐపీఓలు. మిగతా తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు. వీటికి తోడు ఈ వారం 14 కంపెనీల ఐపీఓల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

లీలా ప్యాలెస్ నుంచి రూ.5,000 కోట్ల ఐపీఓ

మరోవైపు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్క్లోస్ బెంగళూరు లిమిటెడ్ కూడా రూ.5,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఆదివారం సెబీకి దరఖాస్తు సమర్పించింది. సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే దేశ హాస్పిటాలిటీ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. రూ.5,000 కోట్ల ఐపీఓలో రూ.2,000 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా రూ.3,000 కోట్లు కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరిస్తారు.

కాగా సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ అందించే సోలార్91 క్లీన్‌టెక్ అనే ఎస్ఎంఈ కంపెనీ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.100 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది.

పండగల సీజన్‌పై

లగ్జరీ కార్ల కంపెనీల భారీ ఆశలు

ఈ ఏడాది 50,000కు పైగానే విక్రయాలు



న్యూఢిల్లీ: పండగల సీజన్ దగ్గర పడుతోంది. దీంతో కార్ల కంపెనీలు ముఖ్యంగా మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు.. అమ్మకాలపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో ఉన్న పాపులర్ మోడల్స్‌తో పాటు మరిన్ని కొత్త మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే కొన్ని లగ్జరీ మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశాయి. మరికొన్ని కంపెనీలు వచ్చే వారం, పది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పండగల సీజన్ ప్రత్యేక ఆఫర్లు మరో ఎత్తు. లగ్జరీ కార్ల కంపెనీలతో పాటు డీలర్లు కూడా తమవైన మరిన్ని ఆఫర్లు జోడిస్తున్నారు. దీంతో ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్టు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు.

'ఈవీ'ల జోష్

వ్యాపారంలో 'ట్రెండ్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటారు. లగ్జరీ కార్ల కంపెనీలూ ఈ మాటను బాగా వంట పట్టించుకున్నాయి. ఇందులో భాగంగా రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణించేందుకు వీలుగా హైఎండ్ లగ్జరీ ఈవీలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మెర్సిడెజ్ బెంజ్ ఇప్పటికే తన మేబాక్ సీరిస్‌లో రెండు హైఎండ్ ఈవీలను విడుదల చేసింది. ఒకసారి చార్జింగ్ చేస్తే తమ ఈవీల్లో 600 నుంచి 800 కిలోమీటర్ల వరకు రీచార్జి అవసరం లేకుండా ప్రయాణించవచ్చని కంపెనీ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. ఈవీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాయితీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్టు ఆడి ఇండియా చీఫ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది మన దేశంలో 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. అందులో లగ్జరీ కార్ల అమ్మకాలు రెండు శాతం కూడా లేవు. ఈ ఏడాది మాత్రం ఈ అమ్మకాలు 50,000 నుంచి 51,000 మధ్య ఉండే అవకాశం ఉందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. హై ఎండ్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీకి తోడు మరో 20 శాతం సెస్ విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వాలు జీరో నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ పన్నులను హేతుబద్ధం చేస్తే దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు మరింత జోరందుకుంటాయని కంపెనీలు చెబుతున్నాయి.

నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్‌లకు వొడాఫోన్ ఐడియా 30,000 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా మరోసారి భారత టెలికాం మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందుకు పెద్దఎత్తున తన 4జీ సేవలను విస్తరించడంతో పాటు 5జీ సేవల ప్రారంభానికీ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన నెట్‌వర్క్ యంత్రపరికరాల కొనుగోలు కోసం నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్ కంపెనీలకు 360 కోట్ల డాలర్ల (సుమారు రూ.30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కంపెనీలు ఈ పరికరాల సరఫరా వచ్చే నెల నుంచే ప్రారంభిస్తాయి. 4జీ, 5జీ టెలికాం సేవల ద్వారా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలతో దీటుగా పోటీపడవచ్చని వొడాఫోన్ ఐడియా భావిస్తోంది.

★ మారుతి సుజుకీ.. వ్యాగన్‌ఆర్ వాల్ట్జ్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఈ లిమిటెడ్ ఎడిషన్‌లో ప్రత్యేకమైన స్టైలింగ్, కొత్త ఫీచర్లను చేర్చింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ఐ వేరియంట్స్‌లో వ్యాగన్‌ఆర్ వాల్ట్జ్ అందుబాటులో ఉండనుంది. 1లీటర్, 1.2 లీటర్ అడ్వాన్స్‌డ్ కే-సిరీస్ ఇంజన్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ధరలు రూ.5.64 లక్షలు- రూ.6.71 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి.

★ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రెండు కొత్త క్రెడిట్ కార్డ్స్‌ను తీసుకువచ్చింది. మయూర, అశ్వ పేర్లతో ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మయూర కార్డును డిజైన్ చేయగా ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అశ్వ కార్డును రూపొందించింది.

★ బజాజ్ ఫిన్‌సర్వ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ప్రారంభించిన ఏడాది కాలంలోనే రూ.3,500 కోట్ల ఏయూఎం (ఆస్తుల నిర్వహణ)ను అధిగమించిందని బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇప్పటికే ఈ ఫండ్ రెగ్యులర్ ప్లాన్ 41.30 శాతం, డైరెక్ట్ ప్లాన్ 43.43 శాతం రిటర్నులు అందించిందని తెలిపింది.

26,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో నైట్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,849-25,336 పాయింట్ల మధ్యన కదలాడి 434 పాయింట్ల లాభంతో 25,791 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,100 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

❒ 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,530, 25,418, 25,238, 25,030 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 26,100 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,300
నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	116
వరంగల్	120	గుంటూరు	119
కరీంనగర్	120	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	113
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	116		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతతో మార్కెట్లలో ఊపు కనిపిస్తోంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో ఇన్వెస్టర్లు ఏ క్షణమైనా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. ఈ వారం నిఫ్టీకి 25,550 వద్ద మద్దతు స్థాయిలుండగా, 25,800 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మెరుగైన సంకేతాలు రాకుంటే ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉండే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బలం పెరుగుతోంది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: జూలై నెలలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో దిద్దుబాటు మొదలైంది. 15 శాతం వరకు పతనమయ్యాయి. రూ.875 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు మూడు సార్లు రూ.970 వద్ద నిరోధాన్ని ఎదుర్కొంది. గత శుక్రవారం నాటి సెషన్లో భారీ వాల్యూమ్‌తో ఈ స్థాయిని అధిగమించిన ఈ షేరు 3.50 శాతం లాభంతో రూ.981 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.980/960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ టైట్ అవుతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయి రూ.3,860కి చేరువ అవుతోంది. ఒకవేళ దీన్ని అధిగమిస్తే భారీ ర్యాలీకి ఆస్కారం ఉంది. లేదంటే పడినప్పుడు కొనుగోలు చేయటం మంచిది. గత శుక్రవారం ఈ షేరు 2.99 శాతం లాభంతో రూ.3,860 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750/ 3,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్: కొన్ని నెలల అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరులో మొదలైన కన్సాలిడేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం చక్కని బేస్ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ.870 వద్ద కదలాడుతోంది. గత శుక్రవారం 3.33 శాతం లాభంతో రూ.877 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో బ్రేకౌట్ జరిగే అవకాశం ఉంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.870 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.950/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.845 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్ కుబోటా: జీవితకాల గరిష్ఠాన్ని అందుకున్న ఈ షేర్లలో 16% మేర కరెక్షన్ జరిగింది. సెప్టెంబరులో అక్యుములేషన్ కనిపించింది. గత శుక్రవారం గణనీయమైన వాల్యూమ్‌తో ఈ షేరు ఏకంగా 6.88% లాభంతో రూ.4,079 వద్ద క్రాస్‌లైన్ నిరోధాన్ని దాటింది. చక్కని రిస్క్ రివార్డుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.3,950 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: ఈ షేరులో ఈ ఏడాది ఆరంభంలో మొదలైన కరెక్షన్ ముగిసింది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించింది. మంచి స్ట్రెంత్‌తో నిలదొక్కుకుంటోంది. గత శుక్రవారం 4.52% లాభంతో రూ.2,355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,525 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,600/ 2,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,500 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 చేరువలో నిఫ్టీ

నిఫ్టీ గత వారం తొలి నాలుగు సెషన్లలో మైనర్ కరెక్షన్‌లో ట్రేడయినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించింది. నాలుగు రోజుల కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలకడగా ఉండడం మార్కెట్లో బలానికి సంకేతం. చివరికి వారం మొత్తం మీద 435 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 25,800 చేరువలో ముగిసింది. గత కొద్ది వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండా 23,800 స్థాయి నుంచి 2,000 పాయింట్ల మేరకు రికార్డు ర్యాలీని సాధించింది. అయితే మిడ్‌క్యాప్ సూచీ తొలుత బలమైన కరెక్షన్ సాధించి 2,000 పాయింట్లు నష్టపోయినా శుక్రవారం బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 175 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 170 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత కొద్ది వారాలుగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కరెక్షన్ సాధిస్తూ వస్తున్నాయి. మానసిక అవధి 26,000 వద్ద నిఫ్టీ అప్రమత్త సానుకూల ధోరణిలో ప్రారంభం కావచ్చు. తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.




వి. సుందర్ రాజా

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడయి 1,850 పాయింట్ల మేరకు లాభపడి 53,800 వద్ద క్లోజయింది. ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. ప్రధాన నిరోధం 54,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 53,300 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మధ్యకాలిక నెలవారీ చార్టుల ప్రకారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నట్టు ఆర్ఎస్ఐ సూచీ సంకేతం ఇస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలన్న సంకేతం ఇది. మార్కెట్ ప్రస్తుతం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు		
నిరోధం :	25,850	25,930
మద్దతు :	25,760	25,700



ఎక్సైజ్‌లో సిఫారసుల వెల్లువ!

- » బదిలీల కోసం మంత్రిపై పెరుగుతున్న ఒత్తిళ్లు
- » ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం విపరీతమైన పోటీ
- » 'వైసీపీ' అధికారులకూ నేతల లేఖలు
- » మాకు ఇప్పుడూ అన్యాయమేనా?
- » వైసీపీ బాధిత అధికారుల ఆవేదన

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి ఆ శాఖ మంత్రిపై తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నాయి. ఒకప్పుడు కొన్ని బదిలీలను మాత్రమే రాజకీయ సిఫారసులపై చేస్తే, మిగిలినవి సమర్థత, సీనియారిటీ ఆధారంగా చేసేవారు. కానీ ఇప్పుడు ఉన్నతాధికారుల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అన్ని స్థాయిల పోస్టింగుల కోసం సిఫారసులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మద్యం షాపులు, బార్లు ఎక్కువగా ఉండే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఏలూరు, ఇతర ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం అధికారుల మధ్య పోటీ విపరీతంగా పెరిగింది. గత ప్రభుత్వంలో రెండుగా చీలిపోయిన ఎక్సైజ్ శాఖ ఏకీకరణ జరగడం, ప్రైవేటు మద్యం షాపుల పాలసీ వస్తుండటంతో ఎక్సైజ్‌లో పోస్టింగులకు డిమాండ్ పెరిగింది. ముఖ్య నగరాలు, పట్టణాలు ఎక్కువగా ఉండే జిల్లాలు కావాలని అధికారులు పోటీపడుతున్నారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మూడు కేడర్ల అధికారులూ అవే కోరుకుంటున్నారు. ఈ క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి పెద్దఎత్తున సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఇదే అదనుగా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కొందరు అధికారులకూ మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడంపై విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో పోస్టింగుల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏఈఎస్, సీఐల వరకు అన్ని కేడర్ల పోస్టులకూ భారీగా పోటీపడుతున్నారు. అయితే ఆ జిల్లాలో తాను చెప్పిన వారికే పోస్టింగులు ఇవ్వాలని ఓ ఎమ్మెల్యే పట్టుబడుతున్నారు. ఈ జిల్లాలో పోస్టింగుల కోసం కొందరు మంత్రులు ఇచ్చిన సిఫారసుల లేఖలనూ పక్కన పెడుతున్నట్లు తెలిసింది. అయితే ఆ ఎమ్మెల్యే 'వైసీపీ' అధికారులకూ సిఫారసు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఆ నగరం రిజర్వ్ కోటాలోకి వెళ్లిపోయింది. విశాఖపట్నంలో పాతుకుపోయిన అధికారులకే పోస్టింగులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు అధికార వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అప్పుడూ.. ఇప్పుడూ

గత ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు మళ్లీ మంచి పోస్టుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ కాలం విజయవాడలో పనిచేసిన అధికారి ఇప్పుడు మళ్లీ విజయవాడకు రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అప్పట్లో స్పెషల్ సీఎస్‌తో కలిసి ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే బార్లకు మేలు చేసేందుకు ప్రభుత్వ మద్యం షాపులను మార్చేశారు. అప్పట్లో విశాఖపట్నంలో హవా సాగించిన మరో అధికారి ఇప్పుడు మళ్లీ అదే కావాలని ప్రయత్నిస్తున్నారు.

మహిళా అధికారులూ.. పోటాపోటీ

ఏలూరు డిప్యూటీ కమిషనర్ పోస్టు కోసం ఇద్దరు మహిళా అధికారుల మధ్య భారీ పోటీ ఏర్పడింది. వారిలో ఓ అధికారిపై 'వైసీపీ' ముద్ర ఉంది. గత ప్రభుత్వంలో డిస్టిలరీ విభాగంలో పని చేసి, అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో అంటకాగినట్లు విమర్శలున్నాయి. మరో అధికారి రాయలసీమలో పనిచేశారు. నాయకులు ఈ ఇద్దరికీ సిఫారసులు లేఖలు ఇవ్వడంతో పోటీ ఏర్పడింది. ఇక గుంటూరు ఈఎస్ పోస్టు కోసం కూడా ఇద్దరు మహిళా అధికారులు పోటీపడుతున్నారు. వారిలో ఓ అధికారి గత ప్రభుత్వంలో సెబ్‌లో చక్రం తిప్పారు. మద్యం డిపోలో పనిచేస్తున్న మరో అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇక, గత ప్రభుత్వంలో అనామక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు కూడా తమకు అన్యాయం జరుగుతుందేమోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జేసీ స్థాయిలోని ఓ అధికారి గత ప్రభుత్వంలో బాధిత అధికారిగా ఉన్నారు. గత ప్రభుత్వంలో వేధింపులకు గురిచేయడంతో తాను ఇక్కడ ఉండలేనని, తెలంగాణకు వెళ్లిపోతానని కూడా దరఖాస్తు చేసుకున్నారు. అలాంటి వారికి ఇప్పుడైనా న్యాయం చేస్తారా? అనే సందేహాలు నెలకొన్నాయి.

డీఆర్‌డీఏ పీడీల బదిలీలు

23 మంది మున్సిపల్ కమిషనర్లు కూడా..

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు డీఆర్‌డీఏ పీడీలతో పాటు మున్సిపల్‌శాఖ పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది. భీమిలి డివిజన్ డీఎల్‌డీఓ బి.లక్ష్మీపతిని విశాఖపట్నం డీఆర్‌డీఏగా పీడీగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పీడీ ఎం.ఎస్ శోభారాణిని ఆమె సొంత శాఖ సాంఘికసంక్షేమశాఖకు బదిలీ చేశారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారి టి.వి. విజయలక్ష్మిని గుంటూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న డీఎల్‌డీఓ డి.ప్రతాప్‌రెడ్డిని కర్నూలు డీఆర్‌డీఏ పీడీగాను, నగరి డ్వామా క్లస్టర్ ఏపీడీగా ఉన్న టి.ఎన్. శోభన్‌బాబును తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగాను, కృష్ణా డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న వి.నాగరాజకుమారిని నెల్లూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. చిత్తూరు డీఆర్‌డీఏ పీడీగా ఉన్న డీఎంకే తులసిని ఆమె సొంత శాఖ వాణిజ్య పనులశాఖకు రీపాట్రియేట్ చేశారు. శ్రీకాకుళం డ్వామా ఏఓగా ఉన్న డీఎల్‌డీఓ విద్యాసాగర్‌ను అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాక ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా మున్సిపల్‌శాఖలోనూ బదిలీలు చేశారు. అదే విధంగా పలు జిల్లాలకు సంబంధించి ఎంపీడీఓల అంతర్‌జిల్లాల బదిలీలు కూడా చేపట్టారు. పలువురు ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు ఇచ్చారు.

అటవీశాఖలో బదిలీలు, పోస్టింగ్‌లు

సాధారణ బదిలీల్లో భాగంగా అటవీశాఖలో 13మంది స్టేట్ క్యాడర్‌లోని అసిస్టెంట్, డిప్యూటీ కన్జర్వేటర్లను ప్రభుత్వం బదిలీ చేసి, పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. హెడ్ ఆఫీస్‌లోని ఎం.శామ్యూల్‌ను అనకాపల్లి డీఎఫ్‌వోగా, కృష్ణా జిల్లా డీఎఫ్‌వో కె.రాజశేఖర్‌రావును ప్రకాశం జిల్లా సోషల్ ఫారెస్ట్‌కు, ప్రకాశం డీఎఫ్‌వో పి.సునీతను కృష్ణా జిల్లాకు, ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వోగా, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో టి.నాగమణేశ్వరిని నంద్యాలకు, చింతపల్లి సోషల్ డీఎఫ్‌వో సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, పాడేరు డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, రాజమండ్రి ఏసీఎఫ్ టి.చక్రపాణిని శ్రీసత్యసాయి డీఎఫ్‌వోగా, పల్నాడు డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావును మంగళగిరి ఎఫ్‌యూఓగా, తిరుపతి డీఎఫ్‌వో జి.సతీష్‌ను ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వోగా, గిద్దలూరు డీఎఫ్‌వో వై.వి.నరసింహారావును చింతపల్లికి, రాజమండ్రి ఏపీఎస్ఎఫ్‌పీ డీఎఫ్‌వో ఇ. హారికను సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వోగా, ఈస్ట్‌గోదావరి డీఎఫ్‌వో బి.నాగరాజును రాజమండ్రి ఏపీఎస్ఎఫ్‌పీ డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్‌లు ఇచ్చారు.



అంతకాపల్లి-మొగిలివలస గ్రామాల మధ్య వంతెన..



రాజాం-శ్రీకాకుళం మధ్య సారధిగెడ్డపై వంతెన..



రాజాం-పాలకొండ రోడ్‌లో గురవాం సమీపంలో వంతెన..

అడుగెయ్యాలంటే భయమే

- శిథిలమైన కాజ్‌వేలు, వంతెనలు
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

రాజాం రూరల్: అయిదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపించడంతో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పాలన సాగింది. ప్రధాన పట్టణాలను కలిపే రహదారుల్లో వంతెనలు, గ్రామాలను అనుసంధానం చేసే కాజ్‌వేల వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితంగా అయిదేళ్లలో వాటి నాణ్యత మరింతగా క్షీణించి ప్రమాద ఘంటికలు మోగించే స్థితికి చేరుకున్నాయి. ప్రధానంగా రాజాం-పాలకొండ మార్గంలో గురవాం స మీపంలో కాజ్‌వే పూర్తిగా శిథిల మైంది. ఎప్పుడు కూలుతుందో తెలి యని స్థితిలో ఉంది. ఇదే జరిగితే విశాఖ వయా రాజాం, పాలకొండ, మీదుగా ఒడిషా మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగే పరిస్థితి నెలకొనే అవకాశాలున్నాయి. ఇదే పరిస్థితి రాజాం-శ్రీకాకుళం ప్రధాన మార్గంలో సారధి గెడ్డపై వందేళ్ల నాటి వంతెన సైతం ఏయేటి కాయేడు భూమిలోకి కుంగిపోతోంది. వంతెన రెయిలింగ్ విరిగిపోయి అయిదేళ్లు కావస్తోంది. ఇక్కడ సైతం ఏమాత్రం తేడా వచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు వీల్లేని పరిస్థితి ఇక్కడ ఉంది. దీంతో జైపూర్ వయా రాజాం, శ్రీకాకుళం మీదుగా ఒడిషాలోని బెర్హంపూర్ తదితర పట్టణాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగనుంది.

జిల్లాలోని చీపురుపల్లి పట్టణంలో రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఆర్‌ఓబీ నిర్మాణ పనులు పూర్తికాలేదు. దీంతో రాజాం నుంచి విశాఖ, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాలకు వందలాది వాహనాలు ఈమార్గంలో చిలకపాలెం మీదుగా రాకపోకలు సా గిస్తున్నాయి. ఫలితంగా ఈ వంతెనపై పెనుభారం పడి ప్రమాదాన్ని శంకి స్తోంది. అలాగే అంతకాపల్లి-మొగిలివలస గ్రామాల మధ్య సారధిగెడ్డపై వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది.

చిరంజీవికి మంత్రి కొండపల్లి అభినందనలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): తెలుగు చిత్రరంగంలో 156 సినిమాల్లో నటించి 537 పాటలకు, ప్రేక్షకులు మెచ్చే విధంగా డ్యాన్సులు చేసిన మెగాస్టార్ చిరంజీవి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించటం తెలుగు ప్రజలకి గర్వకారణమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చిరంజీవిని అభినందించారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చిరంజీవి మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు.

నైతిక విలువలు అవసరం

లక్కవరపుకోట: సమాజంలో నైతిక విలువల, దైవత్వానికి మారుపేరుగా సుపథ నిలుస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం ఎల్.కోటలో జరిగిన సుపథ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీహరివర్మ సొంత ఖర్చులతో విద్యార్థులకు చదువుతోపాటుగా సంస్కృతిక, సంప్రదాయాలు, నైతిక విలువలు, ఫైందత్వం నేర్పడం చాలా ఆనందకరమైన విషయమన్నారు. ఇటువంటి సంస్థను అందరూ ప్రోత్సహించాలని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనాదు పెదబాబు, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జీఎస్.నాయుడు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ డీఎంకు బదిలీ

విజయనగరం(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ కె. మీనాకుమారిని బదిలీచేస్తూ ఆయా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆమెను హెడ్‌ఆఫీస్‌కు బదిలీ చేస్తు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగరం రూరల్: నగరంలోని తోటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రదర్శించిన రామరాజ్యం బుర్రకథ ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన సీనియర్ కళాకారుడు కాళ్ల అప్పారావుకు చెందిన మజ్జి గౌరీ కళా బృందం ఆధ్వర్యంలో బుర్రకథను ప్రదర్శించారు. స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా కళాకారిణులు వాణికుమారి, ఈశ్వరమ్మ సహకారం అందించారు. ఈ బుర్రకథలో శ్రీరామచరితం గురించి వివరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీఎస్ భగవాన్, కెవీ రమణాజీ, భీమ్‌సింగు, ఉమాశంకర్, విజయ్‌కుమార్, ఎన్ శ్రీనివాసరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం

రాజాం రూరల్: రెండేళ్లకోమారు రాజాంలో నెలరోజుల పాటు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రాజాం, సారధి గ్రామ దేవతలు కోటదుర్గమ్మ తల్లి, బురదల పోలమ్మతల్లి, బంగారమ్మ తల్లి, దుర్గమ్మతల్లి ఉత్స వాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణం లోని కుమ్మరివీధిలోని అమ్మవార్ల ఆలయం వద్ద ఆదివారం ఉదయం అయిదు గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటి సభ్యుల సారథ్యంలో దుర్గమ్మతల్లి ఘటం తిరువీధి ఉత్సవం ప్రారంభించారు. పురవీధుల్లో అమ్మవారి ఘటానికి ముర్రాటలు సమర్పించి పూజలు చేసేందుకు బారులు తీరారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం చిన్నా, పెద్దా తేడా లేకుండా అమ్మవారి ఘటాన్ని ఎత్తుకున్నారు. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకూ పురవీధుల్లో తిరువీధి ఉత్సవం కొనసాగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజాం సీఐ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భూఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీగోడను ఆనుకొని ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ చర్యలను నిలుపుదల చేయాలని జనసేన బొబ్బిలి నియోజకర్గ ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారులకు వత్తాసు పలికిన వారిపై జనసేన ఆందోళన చేస్తుందని తెలిపారు.

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి విఘాతం

బొబ్బిలి: దేశంలో జమిలి ఎన్నికల విధానం అమలులోనికి వస్తే ప్రజాస్వామ్యానికి పూర్తి విఘాతం కలుగుతుందని జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ధ్వజమెత్తారు. బొబ్బిలిలో ఆదివారం సీపీఎం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు పి.శంకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ నియంతృత్వ పాలనకోసం బీజేపీ అర్రులుచాస్తోందన్నారు. ప్రజాస్వామ్యానికి నిలువునా తూట్లు పొడిచేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఒకేదేశం ఒకే ఎన్నిక నినాదంతో , మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు చైతన్యవంతులు కావాలని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు టీవీ రమణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలపై దోబూచులాడుతున్న వారికి శాస్తి తప్పదన్నారు. టీడీపీ, జనసేన తమ గళం వినిపించాలని డిమాండ్ చేశారు. గోపాలం, శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వద్ద స్వచ్ఛభారత్

విజయనగరం రూరల్: కేంద్ర ప్రభుత్వం, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఆదివారం విజయనగరం రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని పెద్ద చెరువు వద్ద 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద చెరువుకి ఆనుకుని వున్న పిచ్చిమొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను, తొలగించి, చెరువు పరిసరాలను శుభ్రం చేశా రు. ఈ కార్యక్రమానికి ముందు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు.

ఎస్.కోటలో భారీ వర్షం

- నీటమునిగిన శ్రీనివాసకాలనీ
- విశాఖ-అరకు రోడ్డు జలమయం

శృంగవరపుకోట, సెప్టెంబరు 22: శృంగవరపుకోట పట్టణంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో శ్రీనివాస కాలనీ నీటి మునిగింది. ఏ వీధిలో చూసినా వరద నీరే దర్శనమిచ్చింది. ప్రధానంగా పుణ్యగిరి గెడ్డ ఉప్పొంగింది. గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసాల్లోకి వరద నీరు చేరింది. పుణ్యగిరి గెడ్డ ప్రవాహానికి ఆక్రమణలు అవరోధంగా మారడంతో ప్రధాన రహదారిపైకి వరద వచ్చింది. దీంతో రహదారికి ఇరువైపులా ఉన్న నివాసాలతో పాటు రెండు ప్రైవేటు పాఠశాలల్లోకి వరద నీరు చేరింది. అలాగే, విశాఖ-అరకు రోడ్డు చెరువును తలపించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హోటల్ ముంతాజ్ వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడ్డారు. టీడీపీ నాయకుడు కాపుగంటి శ్రీనివాసరావు (వాసు) కార్యకర్తలతో కలసి నీట మునిగిన నివాసాలను పరిశీలించారు. వర్షాల సమయంలో కాలనీలోకి వరద రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.





పుణ్యగిరి గెడ్డ ఉప్పొంగడంతో ఎస్.కోట శ్రీనివాసకాలనీలో పారుతున్న వరద నీరు

వరదబాధితులకు ఆర్థిక సాయం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 22: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ నాయకులు అవనాపు విజయ్, అవనాపు భార్గవి దంపతులు రూ. 50 వేలు చెక్కును విరాళంగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకి ఆదివారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా విజయ్ మాట్లాడుతూ, ఇటీవల విజయవాడలో తుపాను బీభత్సం సృష్టించిందని వేలాది కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్వరమే సహాయక చర్యలు చేపట్టి వారిని ఆదుకున్నారన్నారు.



అదితికి చెక్కు అందిస్తున్న విజయ్, భార్గవి దంపతులు

జామి-కొట్టాం వంతెనపై గుంతలు పూడ్చివేత

- సమస్యను నాలుగుగంటల్లో పరిష్కరించిన ఎమ్మెల్యే



జామి-కొట్టాం వంతెన రిపేర్లు చేసి తారురోడ్డు వేసిన దృశ్యం

జామి, సెప్టెంబరు 22: జామి నుంచి కొట్టాం వెళ్లే హైవేలో ఉన్న వంతెనపై నుంచి లారీలు అధిక బరువుతో వెళ్లడం వల్ల గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులతో పాటు ప్రమాదాలబారిన పడుతున్నారని మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి తెలియజేశారు. మాజీ జడ్పీటీసీ చెప్పిన నాలుగుగంటల వ్యవధిలో ఎమ్మెల్యే సంబంధిత హైవే అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో వెంటనే హైవే సిబ్బంది రంగంలోకి దిగి వంతెనపై ఉన్నగోతులు కప్పి తారురోడ్డు వేశారు. అనంతరం ఈపనులు దగ్గరుండి చేయించిన మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు ఈవంతెన రిపేర్లు చేయాలని హైవేవారిని కోరినా పట్టించుకోలేదని, అప్పటి పాలకులు కుడా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈసమస్యను సంబంధితశాఖ వారు కేవలం నాలుగు గంటల్లో పరిష్కరించడం అభినందనీయం అన్నారు.

సాహిత్యానికి విమర్శ గీటురాయి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం/రూరల్: రచనలపై చేసే సద్విమర్శలను ఆ సాహిత్యానికి గీటురాయిగా గుర్తించాలని, అలాంటప్పుడే ఆ రచనలకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని తానా నవలా బహుమతి గ్రహీత, సాహిత్య అకాడమీ సలహా బోర్డు సభ్యులు చింతకింది శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం అధ్యక్షతన ఆదివారం స్థానిక ఓ ప్రయివేటు పాఠశాలలో నిర్వహించిన రారవే సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పిల్లా తిరుపతిరావు రచించిన డమరుధ్వని-ప్రతిధ్వని విశ్లేషణాత్మక గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సాహిత్యోపన్యాసం చేశారు. విమర్శలే సాహిత్యాన్ని సరైన మార్గంలో నడిపిస్తాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆల్తి మోహనరావు పుస్తక పరిచయం చేశారు. దుప్పల రవికుమార్ పలు అంశాలను వివరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గార రవిప్రసాద్, సూర్యశైలజ, గంటేడ గౌరినాయుడు, చందనపల్లి గోపాలరావు, గర్బాన సుమతి, పొట్నూరు కోటిబాబు, పొదిలాపు శ్రీనివాసరావు, సమతం మహేశ్వరరావు, ఉరిటి రామలింగేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, నల్ల రవికుమార్, పండూరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాట యోధుడు సీతారాం ఏచూరి: అశోక్



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం దాసన్నపేట: ప్రజాపోరాటయోధుడు భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకత నిలుపుకున్న మహానేత సీతారాం ఏచూరి అని కేంద్రమాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డ నిజమైన రాజకీయ నాయకుడు ఏచూరి అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ తన దేహాన్ని కూడా దేశం కోసం ఆసుపత్రికి అప్పగించిన దేశ భక్తుడు ఏచూరి అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ, ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరని లోటన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ, ఏచూరి చేపట్టిన పోరాటబాటలో నడుస్తామని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతూ, ప్రశ్నించే తత్వాన్ని నేటి యువత అలవర్చుకోవాలన్నారు. బెహరా శంకరరావు, దయానంద్, విద్యాసాగర్, రెడ్డి శంకరరావు, టీవీ రమణ, లక్ష్మీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేపల వర్తకులపై అధికారుల దాడులు

విజయనగరం రింగురోడ్డు: నగరంలో ఆదివారం పలు కూడళ్లల్లో చికెన్, మటన్, చేపల వర్తకులపై తూనికలు, కొలతలు శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టరు దామోదరనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చట్ట విరుద్ధమైన తూనికా రాళ్ళు వినియోగించి, వినియోగదారులను మోసం చేస్తున్న ఐదుగురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశారు. మళ్లీ ఇటువంటి మోసాలకు పాల్పడితే, భారీ అపరాధ రుసుం, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని వర్తకులను ఇన్‌స్పెక్టరు దామోదర నాయుడు హెచ్చరించారు. వినియోగదారులు కూడా మోసాలు పట్ల అవగాహన కలిగి వుండాలని నెలలో రెండు పర్యాయాలు తూనికలు, కొలతలపై అవగాహన సదస్సుని ఏర్పాటు చేస్తున్నామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాజచెరువువలసలో గిరిజనుల వింత ఆచారం



దిష్టిబొమ్మలతో వెళుతున్న గిరిజనులు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పట్టణానికి కూతవేటు దూరంలో గల దిబ్బగుడ్డివలస పంచాయతీ రాజచెరువువలస గిరిజనులు ఆదివారం వరిగడ్డితో దిష్టిబొమ్మలను తయారు చేసుకుని, వాటిని గ్రామ పొలిమేరల్లో ఊరేగించారు. వండిన అన్నం, బియ్యాన్ని వరి పంటపొలాల్లో చల్లారు. ఇలా చేస్తే ప్రకృతి మాత కరుణిస్తుందని, పంటలను సమృద్ధిగా పండేలా, పంటదిగుబడులు పుష్కలంగా ఉండేలా ఆశీర్వదిస్తుందని వారి నమ్మకం.

ఘనంగా పశువులమ్మ తల్లి పండగ

వేపాడ: మండలంలోని ఏడు గ్రామాల్లో ప్రజలు ఆదివారం గ్రామ దేవత పశువులమ్మతల్లి పండగను వైభవంగా నిర్వహించుకున్నారు. పండగను పురస్కరించుకుని అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దబ్బిరాజుపేట, వేపాడ, వల్లంపూడి, ఆతవ, సీతంపేట, రాముడుపేట, బొద్దాం, వీలుపర్తి తదితర గ్రామాల ప్రజలు ఏటా నిర్వహించుకున్నట్టే ఈ ఏడాది కూడా వరినాట్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన వర్షాలు బాగా కురవాలని పంటలు బాగా పండాలని, పశు సంపద వృద్ధి చెందాలని అమ్మవారికి పూజలు చేసుకున్నారు. గ్రామపెద్దలు డప్పువాయిద్యాలు, బ్యాండు మేళాలతో అమ్మవార్ల గుడులకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడంతో పాటు మొక్కులు తీర్చుకున్నారు. **లక్కవరపుకోట:** మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. చందులూరు, మార్లాపల్లి, లింగంపేట, కిత్తన్నపేట తదితర గ్రామాల్లో పశువుల పండుగను ఆయా గ్రామాల సంప్రదాయాలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పశువులను అందంగా తయారుచేసి పశువులను మందగా అమ్మవారి గుడికి తీసుకువెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.



పశువులకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

ఆకట్టుకున్న 'అంతర్యామి'ప్రదర్శన

బొబ్బిలి, సెప్టెంబరు 22: బొబ్బిలి శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి ఆనందోబ్రహ్మ కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కళాప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలను ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు మింది విజయమోహన్ బృందం వేంకటేశ్వరస్వామి పరివార వేషధారణలతో 'అంతర్యామి' అనే ఆధ్యాత్మిక పౌరాణిక ప్రదర్శనతో రంజింపజేశారు. శ్రీకృష్ణవిలాసం శాస్త్రీయ నృత్యాలు, వెస్టన్ డ్యాన్స్ మాబ్స్. చిన్నారులు, మహిళల కోలాట ప్రదర్శనలు, జానపద నృత్యాలు తదితర సాంస్కృతిక ప్రదర్శలను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. వీరందరినీ ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. కళాభారతి ప్రతినిధులు నంబియార్ వేణుగోపాలరావు, కర్రి సత్యనారాయణ, పుల్లెల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, అప్పలనాయుడు, గంగాధర్, రాముద్రి గోవిందరావు, చెలికాని కేశవ, లావణ్య, నాగిరెడ్డి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అంతర్యామి కళాప్రదర్శన చేస్తున్న దృశ్యం

మారేడుమిల్లి జలపాతంలో
జిల్లా వైద్య విద్యార్థిని గల్లంతు

- స్నేహితులతో కలసి విహారయాత్రకు వెళ్లిన వైనం

బొబ్బిలి: అల్లూరి జిల్లా మారేడుమిల్లి జలతరంగిణి జలపాతంలో జిల్లాకు చెందిన వైద్య విద్యార్థిని కొసిరెడ్డి సౌమ్య గల్లంతైంది. బొబ్బిలి పట్టణం రావువారి వీధికి చెందిన తాపీమేస్త్రి కొసిరెడ్డి అప్పలనాయుడు, రమాదేవి దంపతుల రెండో కుమార్తె సౌమ్య ఏలూరు ఆశ్రమవైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. 13 మంది తోటి విద్యార్థినులతో కలసి సౌమ్య ఆదివారం విహారయాత్రకు వెళ్లింది. వీరిలో ఐదుగురు విద్యార్థినులు జలతరంగిణి జలపాతంలో గల్లంతయ్యారు. ఇద్దరిని స్థానికులు రక్షించి రాజమండ్రి, రంపచోడవరం ఆసుపత్రులకు తరలించినట్టు సమాచారం. సౌమ్యతో పాటు మరో ఇద్దరి ఆచూకీ లభ్యంకాలేదు. ఈ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియడంతో రావువారి వీధిలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆ వార్డు నాయకులు బొత్స అప్పలు, కొసిరెడ్డి సూరిబాబు తదితరులు హుటాహుటిన ఆదివారం రాత్రి ఏలూరు బయలుదేరారు. సౌమ్యకు అక్క జ్యోత్స్న, తమ్ముడు సాయి ఉన్నారు.

బొగ్గు డంపింగ్ యార్డులో మృతదేహం

- ఒడిశా నుంచి లారీలో తీసుకొచ్చి పడేసినట్లు అనుమానం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ శారదా కర్మాగారానికి చెందిన బొగ్గు డంపింగ్ యార్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. ఆదివారం సాయంత్రం కర్మాగారానికి బొగ్గు తీసుకెళ్లడానికి వచ్చిన కార్మికులు ఈ మృతదేహాన్ని చూసి డీజీఎం సన్యాశిరావుకు తెలిపారు. ఈ బొగ్గు ఒడిశా నుంచి లారీల్లో వచ్చినట్టు డీజీఎం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహం ఏ లారీలో వచ్చిందో తమకు తెలియదని చెప్పారు. ఒడిశాలోని బొగ్గు స్టాక్ పాయింట్ నుంచి వచ్చిన ఏదైనా లారీ నుంచి ఈ మృతదేహాన్ని తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఐ షణ్ముఖరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య

రాజాం రూరల్: మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన మరడాన శివ (31) ఈనెల మొదట్లో రాజాంలో టిఫిన్ షాపు పెట్టాడు. అయితే వ్యాపారం సక్రమంగా నడవకపోవడం, పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో శనివారం రాత్రి మొగిలివలస గ్రామ సమీపంలోని టేకుతోటలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శివ తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ చోరీ కేసులో పాతనేరస్థుడి అరెస్టు

విజయనగరం క్రైం: నగరంలోని అయ్యన్నపేట దువ్వాడ జంక్షన్ సమీపంలో ఉన్న చంద్రమౌళీశ్వర ఆలయ హుండీ చోరీ కేసులో విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన బెల్లాన బాలరాజును అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ వివరాలను ఆదివారం వెల్లడించారు. ఈనెల 19న ఆలయ అర్చకులు జయంతి శ్రీనివాసశర్మ పూజలు నిర్వహించుకొని ఇంటికి వెళ్లిపోయారు. మరుసటిరోజు ఆలయానికి రాగా హుండీ చోరీకి గురైనట్లు గుర్తించి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆలయంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. పాత నేరస్తుడు బాలరాజును అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. బాలరాజు నుంచి రూ.30వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి రిమాండు విధించారు. బాలరాజుపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 16, రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 3, విజయనగరం రూరల్, పార్వతీపురం, డెంకాడ, నెల్లిమర్ల, జామి, భీమిలి స్టేషన్ల పరిధిలో 26 కేసులు ఉన్నట్లు సీఐ వివరించారు.

కుక్కల దాడిలో 23 గొర్రె పిల్లల మృతి

గుర్ల: మండలంలోని చోడవరంలో కుక్కల దాడిలో 23 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన నక్క చిన్నయ్య తన గొర్రె పిల్లలను ఆదివారం మధ్యాహ్నం పశువుల శాలలో పెట్టాడు. అనంతరం గొర్రెలను తోలుకొని తోటలోకి వెళ్లాడు. సుమారు పది కుక్కలు పశువుల శాలలోకి ప్రవేశించి గొర్రె పిల్లలపై దాడి చేశాయి. దీంతో 23 పిల్లలు మృతి చెందాయని చిన్నయ్య లబోదిబోమంటున్నాడు. ఈ విషయాన్ని స్థానిక రెవెన్యూ సిబ్బంది, పశువైద్యులకు తెలియజేశాడు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని, తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

30 లీటర్ల సారా స్వాధీనం

మెంటాడ: వాణిజ గ్రామం సమీపంలో ఆదివారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి నుంచి 30 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆంద్ర ఎస్ఐ కె.సీతారాం చెప్పారు. ద్విచక్రవాహనం సీజ్ చేసి కేసు నమోదు చేశామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

మందుగుండు సామగ్రితో ఇద్దరి అరెస్టు

కొత్తవలస: ఎటువంటి అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సుదర్శనరావు తెలిపారు. చీడివలస గ్రామ మామిడితోటలో మందుగుండు సామగ్రిని నిల్వ చేసిన రొంగలి పంప అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు. కొత్తవలస పంచాయతీ చింతలదిమ్మ గ్రామానికి చెందిన దాసరి వెంకన్న అనే వ్యక్తి మందుగుండు సామగ్రిని కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకుని వెంకన్నను అరెస్టు చేసినట్టు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రేగిడి: రేగిడి నదీతీరం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లను శనివారం రాత్రి తోకలవలస జంక్షన్‌లో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలావతి తెలిపారు. రక్షితపథకాల నీటి సోర్స్ నుంచి అక్రమంగా తరలించడం ఆమె దృష్టికి రావటంతో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల బొడ్డవలస నదీతీర రక్షితసోర్స్ వద్ద ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లపై స్థానిక పోలీస్‌శాఖ కఠిన చర్యలు సంగతి తెలిసిందే.

వర్షాలకు కూలిన పెంకిటిల్లు

రాజాం: పొనుగుటివలసలో శాసపు తవుడుకు చెందిన పెంకిటిల్లు ఆదివారం కూలిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఇంటి గోడలు బాగా నానిపోయి ఇల్లు కూలిపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ఆ సమయంలో ఇంట్లో, ఆరుబయట ఎవరూలేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు

విజయనగరం క్రైం: పట్టణంలోని పూల్‌బాగ్ కాలనీ బిట్ నెంబరు 3లో ఆదివారం సీహెచ్ కాశీచరణ్ తన కారులో కూర్చొని ఉండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థికి గాయాలు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురంలో ఆదివారం సాయంత్రం మినీ వ్యాన్ ఢీకొనడంతో గురుబిల్లి దిలీప్ అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సైకిల్ తొక్కుకుంటూ వీధిలోకి వెళ్లిన దిలీప్‌ను రాజాం నుంచి పార్వతీపురం వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు 108 వాహనంలో రాజాం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ శంకర్ దర్యాప్తు చేస్తున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో పొగలు

రాజాం రూరల్: పట్టణంలోని కస్పావీధిలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో దట్టమైన పొగలు రావడంతో వీధివాసులంతా ఆందోళనకు గురయ్యారు. షాపింగ్ కాంప్లెక్స్ పైభాగంలో యజమాని నివాసం ఉంటున్నాడు. అయితే, షాపులో నుంచి పొగలు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించి యజమానిని అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పొగలు దట్టంగా రావడంతో పాటు ముక్కుపుటాలదిరే స్థాయిలో విషవాయువులు వెదజల్లడంతో ఘటనాస్థలంలో గుమిగూడిన వారంతా చెల్లాచెదురయ్యారు. కేవలం దుర్వాసనతో కూడిన పొగలే తప్ప మంటలు లేకపోవడంతో ఫైర్ సిబ్బంది కొంతకాలం పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఎట్టకేలకు షాపు తెరిచిన సిబ్బంది యాసిడ్ బాటిళ్లు పగిలిపోవడంతో ఈ పరిస్థితి ఎదురయ్యిందని నిర్ధారించారు. ఇదిలా ఉంటే, ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, అనధికారికంగా సల్ఫ్యూరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్‌ను అమ్ముతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి షాపు ముందు బంగారం షాపుల కోసం అవసరమైన మెటీరియల్ అనే బోర్డు పెట్టి నిబంధనలకు విరుద్ధంగా యాసిడ్ అమ్మకాలు చేస్తున్నారని వీధివాసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన షాపులో పోలీసులు తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

మల్లికార్జున కాలనీలో ఘర్షణ

రాజాం రూరల్: పట్టణంలోని మల్లికార్జున కాలనీలో ఆదివారం రాత్రి 10గంటల సమయంలో ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం రాజాం- సారధి గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో రాత్రి 9.30 గంటల సమయంలో అమ్మవారి ఘటం కాలనీకి చేరింది. ఘటం కాలనీ నుంచి వెళ్లిపోయిన క్షణాల్లో కొంతమంది యువకులు అత్యుత్సాహం ప్రదర్శించినట్లు కాలనీలో చెప్పుకుంటున్నారు. ఓ మహిళకు గాయాలు కావడంతో ఆమెకు సంబంధించిన వారంతా ఓ యువకుడిని అనుమానించి వివాదానికి తెరలేపారు. దీంతో చిన్నపాటి వివాదం పోలీసుల రంగప్రవేశం వరకూ దారితీసింది. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించిన పోలీసులు మద్యం మత్తులో ఉన్న అనుమానిత యువకుడిని అదుపులోకి తీసుకుని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు కాలేదు.

లడ్డూ ప్రసాదంలో కల్తీపై విచారణ చేయండి

● మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు

చీపురుపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు అందజేసే పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో కల్తీపై సమగ్రమైన విచారణజరిపి వాస్తవాలు తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఆపదలోఉన్న ఏడుకొండల వెంకన్నను ఆశ్రయిస్తారని, ప్రసాదాల విషయంలో ఆయనకే ఆపద వచ్చిందని తెలిపారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారే కాకుండా ప్రజలంతా ఇష్టపడతారన్నారు. కిలో ఏడొందలకు ఇస్తామన్న నేతిని, రివర్స్ టెండరింగ్‌లో 400లకే ఇస్తామని చెప్పిన కాంట్రాక్టర్‌పై ఎందుకు అనుమానం రాలేదో పాలక మండలి సమాధానం చెప్పాలన్నారు. కోట్లాది మంది మనోభావాలకు సంబంధించిన ఈ వ్యవహారంలో దోషులను గుర్తించి, తగిన రీతిలో శిక్షించాలని గద్దే డిమాండ్‌చేశారు.

హైందవ సమాజంపై దాడి

దత్తిరాజేరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడడం రాక్షసప్రవృత్తి గల వ్యక్తులు చేసిన పని అని, భక్తుల మనోభావాలతో రాక్షసక్రీడ ఆడడమే కాకుండా హైందవ సమాజంపై దాడి అని అంతర్జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లడ్డూప్రసాదంలో కల్తీ నెయ్యి వాడడం భక్తుల మనోభావాలు దెబ్బతీయమేనని తెలిపారు. అటువంటి వ్యక్తులను కఠినంగా శిక్షించడానికి ఎన్డీఏ ప్రభుత్వం చట్టాలకు పదును పెట్టాలని కోరారు.

మెంటాడ రోడ్డుకు మరమ్మతులు

గజపతినగరం: మెంటాడ రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మెంటాడ రోడ్డు చెరువును తలపిస్తుండడంతో పురిటిపెంట గ్రామస్థులు చేయడంతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మరమ్మతులు చేయించారు. మెంటాడ మండలంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వర్షాకాలంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుకలగడంతోపాటు రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈనేపథ్యంలో ఈ విషయంపై మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి హుటాహుటిన మరమ్మతులు చేపటడంతో స్థానికులతో పాటు వాహనచోదకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

త్రోబాల్ పోటీలకు ఐదుగురి ఎంపిక



త్రోబాల్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

గుర్ల: గుర్ల, చింతలపేట పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. త్రోబాల్ విభాగంలో జరిగిన పోటీల్లో విజయనగరం జట్టు రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందని చింతలపేట పీఈటీ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం చింతలపేట జడ్పీ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ నెలిమర్ల తమాస్సెట్ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో క్రీడా కారులను ఎంపికచేసినట్లు చెప్పారు. 34వ ఆంధ్ర రాష్ట్ర జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా బాలికల జట్టు తూర్పుగోదావరి, అనంతపురం, పశ్చిమగోదావరి జిల్లా జట్లపై విజయం సాధించి మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ సెక్రటరీ సులోచన, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

డెంకాడ(భోగాపురం): భోగాపురం మండలంలోని దిబ్బపాలెంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబసభ్యులు పెంటిబోయిన రాము, సీతమ్మ దంపతులను ఆదివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరామర్శించారు. జనసేన నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, చెల్లిబోయిన నర్సింగరావు, పార్టీ భోగాపురం మండలాధ్యక్షులు వందనాల రమణ, దిబ్బలపాలెం జనసేన నాయకులు సమకూర్చిన పదివేల రూపాయల నగదు అందజేశారు. అలాగే నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో బొల్లు త్రినాథ్, నీలాపు ఈశ్వరరావు, శిరపు జయరాజ్, నీలపు బంగారు రెడ్డి బైరెడ్డి రామకృష్ణ, మురళి, చిన్న శివాజీ, వానుము సురేష్ పాల్గొన్నారు.

సారిపల్లిలో కాలేయ వ్యాధిగ్రస్థుడికి ..

నెల్లిమర్ల: మండలంలోని సారిపల్లికి చెందిన కాలేయ వ్యాధిగ్రస్థుడు కిలారి కాంతారావుకు శ్రీకాకుళానికి చెందిన గ్రేస్ హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకురాలు దాశెట్టి హేమ, సంస్థ ప్రతినిధి కె.తేజేశ్వర్‌కుమార్ ఆదివారం జనసేన నాయకుడు చనమల్లు వెంకటరమణ, మజ్జి రామారావు సమక్షంలో రూ.50 వేలు అందజేశారు. చనమల్లు వెంకటరమణ కూడా రూ.ఐదువేలు ఇచ్చారు. కార్యక్రమంలో మజ్జి రాంబాబు, సారిపల్లి సూర్యభాస్కరరావు, మజ్జి గణపతి, గిడిజాల నాగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలి

నెల్లిమర్ల: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్‌మహంతి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని టెక్కలిలోగల విశ్వవిద్యాలయంలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతూ పరిశ్రమలకు ఎంపికకావాలంటే సామర్థ్యం, నైపుణ్యం పెరగాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై మరింత శ్రద్ధ వహించాలన్నారు.డీన్లు సన్నిడియోల్, పుష్పలత,ఐక్యూఏసీ హెచ్‌వోడీ ఎంఎల్ఎన్ ఆచార్యులు విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్న కోర్సులు, ప్రగతి గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, గ్రామ తరంగ్ సీఈవో బాబుశంకర్, డీన్ విజయ్‌బాబు, ప్రొఫెసర్ రమణారావు, దీపక్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల ఎస్ఐగా గణేష్

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎస్ఐగా గణేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన డి.రామగణేష్ విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

26 నుంచి రామాయణ శంఖారావం

విజయనగరం రింగురోడ్డు: కోరుకొండ రోడ్డులో గల రామనారాయణంలో ఈనెల 26 నుంచి మూడురోజుల పాటు రామాయణ శంఖారావం నిర్వహించనున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్ చెప్పారు.ఈ మేరకు ఆదివారం రామాయణ శంఖారావం పోస్టర్‌ను ఆ విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26న వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. 27నుంచి మూడు రోజుల పాటు వాల్మీకి రామాయణంపై సదస్సు జరుగుతుందని చెప్పారు. 29న ముగింపు వేడుకల్లో ద్విసహస్రవాధాని మాడుగుల నాగఫణిశర్మ, కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, మంత్రులు అచ్చెంనాయుడు, కొండపల్లి శ్రీనివాస్, సినీనటుడు సాయికుమార్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నీరజావల్లి, శ్రీరామచంద్రధర్, శారదా దీప్తి, జాహ్నవి రెడ్డి పాల్గొన్నారు.

టోల్ ఫీజు వసూలు చేయకుండా చర్య తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట: విజయదశమి నుంచి పైడిమాంబ పండుగ ముగిసేవరకూ విజయనగరం నుంచి విశాఖవెళ్లే దారిలో జొన్నాడ టోల్‌ఫీజులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఆదివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతు

బొబ్బిలి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ గుంటూరులో చేపట్టనున్న ప్రాయశ్చిత్త దీక్షకు పార్టీ శ్రేణులు సంపూర్ణ మద్దతు పలుకుతున్నాయని అప్పలస్వామి బొబ్బిలి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. ఆదివారం బొబ్బిలిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కొంతమంది జనసేననాయకులుగా చెప్పుకుని సొంతనిర్ణయాలను అమలుచేస్తున్నారని, ఇది పార్టీ నియమావళికి విరుద్ధమని తెలిపారు. అటువంటివారికి ఇప్పటికే షోకాజ్‌నోటీసులు జారీ చేశామని, అవసరమైతే పార్టీ పురోగతికోసం అలాంటి వ్యక్తులను సస్పెండ్ చేస్తామని చెప్పారు. విజయవాడ వరద ప్రభావతి ప్రాంతాల్లో బాధిత కుటుంబాలకు నిత్యావసర కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.సమావేశంలో పార్టీ నాయకులు మనోజ్‌కుమార్ (బాబి), అడబాల నాగు, ధనుంజయ్, సందీప్ పాల్గొన్నారు.

29న మాజీ సైనికుల కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి: సంఘ నూతన కార్యవర్గాన్ని ఈనెల 29న ఎన్నుకోనున్నట్లు బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమసంఘం గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు తెలిపారు. ఆదివారం రాత్రి బొబ్బిలిలోని పాతకోట సైనిక కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా మాజీ సైనికులు సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు పట్ల సంఘ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రెడ్డి దామోదర్, మాజీ అధ్యక్షుడు సబ్బాన సతీష్‌కుమార్, రెడ్డి అప్పలనాయుడు, తిరుపతినాయుడు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతకు పాతరేశారు

● లడ్డూ నాణ్యతపై తప్పును వైసీపీ ఒప్పుకున్నట్లే
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం: పార్టీలో చేరిన వారికి ఆహ్వానిస్తున్న కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: లడ్డూ తయారీలో నాణ్యత లేని నెయ్యికి ఆర్డర్ ఇచ్చి తిరుమల పవిత్రతకు పాతరేశారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. తిరుమల శ్రీవారి లడ్డూకు వినియోగించిన నెయ్యి నాణ్యత లోపించిందని వైసీపీ నాయకులు తప్పును ఒప్పుకున్నట్లేనని తెలిపారు. ఆదివారం గజపతినగరం పార్టీ కార్యాలయంలో వైసీపీ నుంచి గజపతినగరం పంచాయతీ సర్పంచ్ నరవ కొండమ్మతోపాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి లడ్డూకు వినియోగించిన నెయ్యి నాణ్యత లేదని జూలైలో వచ్చిన రిపోర్టును రెండు నెలల తర్వాత బయటపెట్టారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతుంటే తప్పుజరిగిందని ఒప్పుకున్నట్లేగా అని అన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో రోడ్లు కూడా వేయలేక పోయిన వైసీపీ నాయకులు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై నింద వేయడం తగదన్నారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి బుక్ కీపర్లను తొలగిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు తగదన్నారు. మెజార్టీ గ్రామ సంఘ సభ్యులు బుక్ కీపర్లను నియమించుకుంటారని, అది ఏ ప్రభుత్వమైనా వాటి సంఘ సభ్యుల ఇష్టప్రకారం జరుగుతుందని, అందుకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధంలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లతోపాటు ఉద్యోగులు జీతాలు అందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రూ.25 కోట్లతో రోడ్ల నిర్మించనున్నట్లు చెప్పారు. తాగునీరు,పెదమానాపురం బ్రిడ్జి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, పీవీవీ గోపాలరాజు, రాంజీరాజు పాల్గొన్నారు.

తిరుపతి ప్రసాదాన్ని భ్రష్టు పట్టించడం దురదృష్టకరం..

బొండపల్లి: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వైసీపీ ప్రభుత్వం పవిత్ర తిరుపతి ప్రసాదాన్ని భ్రష్టుపట్టించడం దురదృష్టకరమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలోని బోడసింగిపేట టీడీపీ కార్యాలయంలో ముద్దూరు, తమటాడ, నెలివాడ గ్రామాల నుంచి వంద మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో ప్రజల ఐక్యతతో మెలిగినప్పుడే అభివృద్ధి సాధించగలమన్నారు. వెలుగులో సభ్యుల ఎంపిక మేరకు బుక్‌కీపర్‌ను మార్పు చేశారని, ప్రతిపక్షం ప్రతి విషయాన్ని పెడతోవ పట్టించేలా రాజకీయం చేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కోరాడ కృష్ణ గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, కెరటాం, సిటిపల్లి సర్పంచ్‌లు మీసాల జానకిరావు, నంబూరి రాజేష్ (బుజ్జన్న), నడుపూరి భాస్కరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.బాలాజీ, ముద్దూరు, గిట్టుపల్లి మాజీ సర్పంచ్‌లు కళ్యాణపు నారాయణ రావు, అల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డెంకాడ: మోపాడలో కరపత్రం అందజేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, కంది చంద్రశేఖరరావు



కొత్తవలస: అప్పన్నపాలెంలో మాట్లాడుతున్న లలితకుమారి



రామభద్రపురం: మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



విజయనగరం రూరల్: 21వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ప్రజలకు సుపరిపాలన

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో హామీలను వివరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సుపరిపాలన అందిస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మూడోరోజు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరించారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించి కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ విఫల్యాలపై ధ్వజమెత్తారు.

● **విజయనగరం రూరల్:** కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. విజయనగరం నగర పాలక సంస్థలో 21వ డివిజన్‌లోఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలోటీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్, టీడీపీ నాయకులు అవనాపు భార్గవి, విజయ్, కమిషనర్ పి నల్లనయ్య పాల్గొన్నారు. అలాగే ఏడో డివిజన్‌లో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది.

● **డెంకాడ:** కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలుచేసినట్లు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మండలంలోని మోపాడలో నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, డెంకాడ టీడీపీ మండలాధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పాణిరాజు, ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, పద్మావతి పాల్గొన్నారు.

●**కొత్తవలస:** వైసీపీ ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని, కూటమి ప్రభుత్వం ఎటువంటి చార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ వినియోగదారులకు అందిస్తోందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. అప్పన్నపాలెం, ఉత్తరాపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠరావు, ఎంపీడీవో వై.పద్మజ, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు తిక్కాన చిన దేముడు, గొరపల్లి రాము, కోళ్ల వెంకటరమణ, బంగారు రమేష్, కొరుపోలు అప్పారావు, గొంపదుర్గా ఉమేష్, లెంకశ్రీను పాల్గొన్నారు.

●**రామభద్రపురం:** కూటమి ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మండలంలోని కొట్టక్కిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కొట్టక్కి, రొంపల్లిల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి ఆదే శించారు. కొట్టక్కిలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకుసామూహిక సీమంతాలను నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీవో రమామణి, జడ్పీటీసీ అప్పికొండ సరస్వతమ్మ, సర్పంచ్‌లు అనూరాధ,కోట వెంకటనాయుడు, భవిరెడ్డి శంకరరావు, ఎంపీటీసీలు భవిరెడ్డిచంద్ర, వసంతుల తిరుపతి నాయుడు, టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతి నాయుడు, కర్రోతు తిరుపతినాయుడు, కరణం విజయభాస్కరరావు, ముల్లు రాంబాబు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు శరత్ మృతి

గజపతినగరం: జనసేన నాయకుడు, ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు శరత్ ఆదివారం మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు.మృతదేహం గజపతినగరంలోని స్వగృహానికి చేరుకోవడంతో రాజకీయాలకతీతంగా నాయకులు తరలివచ్చారు.శరత్ మృతిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫోన్‌లో పడాల అరుణకు సంతాపం తెలియజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, డాక్టర్ కేఏనాయుడుతోపాటు జనసేననాయకులు మర్రాపు సురేష్, మునకాల జగన్, మిడతాన రవికుమార్, బీజేపీ నాయకులు రెడ్డి పావని, దేవర ఈశ్వరరావు, ఏడు కొండలు సంతాపం తెలిపారు.

ప్రతిఒక్కరూ గీతాపారాయణం చేయాలి

రేగిడి: ప్రతిఒక్కరూ గీతాపారాయణం చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం దేవుదళ గీతామందిరంలో కన్వీనర్ గొర్లి దామోదర్ అధ్యక్షతన దివ్యజీవన సత్సంగం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ, సామంతుల దామోదర్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛత వైపు అడుగులువేయాలి

రాజాం: ప్రజలు స్వచ్ఛత వైపు అడుగులువేయాలని రాజాం జీఎంఆర్ ఐటి కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో డోలపేట శివాలయం ప్రాంగణంలో స్వచ్ఛతాహీసేవలో భాగంగా రాజాం ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వి.రాంబాబు, నాగేశ్వరరావు, వెంకటరమణ, కృష్ణ పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు

బాడంగి: బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం బాడంగి, ముగడ,పిన్నవలస, పూడివలస, రామచంద్రపురం, కోడూరు, మల్లంపేట, భీమవరం గ్రామాలకు చెందిన180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరానికి చెందిన సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి డాక్టర్ శ్రీరామ్మూర్తి ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు పీఆర్వో రవి తెలిపారు. 120 మందికి మందులు అందజేయగా 14 మందికి ఆపరేషన్ల నిమిత్తం విజయనగరం తరలించారు.

విద్యుత్ ఆదాపై అవగాహన

రేగిడి: తాగునీటి వృథా, ప్లాస్టిక్ నిర్మూలన, విద్యుత్‌ఆదాపై స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ సీహెచ్ పద్మ అవగాహన కల్పించారు. ఆదివారం తాటిపాడు పంచాయతీలో స్వచ్ఛతహీసేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నారావు, బాలి రామినాయుడు, శ్రీరాములు,సింహాచలం, గాదం రామమూర్తి పాల్గొన్నారు.

45 మంది రక్తదానం

విజయనగరం రింగురోడ్డు: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 45 మంది రక్తదానం చేశారు. ఆదివారం విజయనగరంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు బి.సన్యాసిరావు, పీఎస్ఎన్‌రావు, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

తెర్లాం: చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని రిటైర్డ్ ఎంఈవో ఎం.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం తెర్లాం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులకు గణితంలో మెలకువలు ఎలా నేర్చుకోవాలో వివరించారు. బొమ్మలు గీయడం, క్విజ్ , వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పురాణాలు, ఇతిహస కథలు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయశాఖ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి, క్రాఫ్ట్ టీచర్ విస్సు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా త్రినాథరావు

విజయనగరం రింగురోడ్డు: కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా ఇన్‌చార్జిగా గాదం వెంకట త్రినాథరావును నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఇన్‌చార్జులను నియమించారు.

బొబ్బిలిలో గణనాథుని నిమజ్జనం

బొబ్బిలి రూరల్: బొబ్బి లి పట్టణంలోని కోరాడవీధి లో గణనాథుని నిమజ్జనోత్సవం ఆదివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. జనసేన నాయకులు గిరిడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్‌కుమార్ వినాయ కుని దర్శించుకున్నారు. అనంతరం యువకుల ఆధ్వర్యంలో వినాయకుని మేళతాళాలు, జానప దనృత్యాలతో సందడిగా ఊరేగింపు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు.

కొండగుంపాంలో సబ్‌స్టేషన్ ఎదుట నిరసన

నెల్లిమర్ల: కొండగుంపాంలో 30గంటలుగా విద్యుత్ నిలిచిపోవడంతో గ్రామస్థులు ఆదివారంసబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. శనివారం సాయంత్రం వీచినగాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్దరించాలని గ్రామస్థులు డిమాండ్‌చేశారు. ఏఈ పిచ్చియ్య సిబ్బందితో వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్దరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

లక్కవరపుకోట: నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సహకరించాలని విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు.ఈ మేరకు ఆదివారం ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమా రిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతిభద్రతలు, అరకు నుంచి దిగుమతి అవుతున్న గంజాయి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కేబీఏ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ గేమ్స్ ఎంపికలు

విజయనగరం టౌన్: విజయనగరం విజ్జీ మైదానంలో అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు సోమవారం ఉదయం 10.30 గంటలకు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభిస్తారని టీడీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు హాజరు కావాలని పార్టీ కార్యాలయం కోరింది.